సాక్షి
నిర్మల్
సోమవారం । 5 । ఫిబ్రవరి । 2024



నాగోబా జాతరకు సన్నద్ధం

నాగోబా జాతర సమీపిస్తుండడంతో కేస్లాపూర్‌లోని ఆలయంలో ఏర్పాట్లు ముమ్మరం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. 8లో▸



దోచుకెళ్తున్నారు.. జర జాగ్రత్త

నిర్మల్‌లో పక్కా ప్లాన్‌తో చోరీలు జరుగుతున్నాయి. తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగలు రెచ్చిపోతున్నారు. దీంతో పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
33.0 /21.0


వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. చలి కాస్త తగ్గుతుంది.

సమస్తం.. గ్రంథస్థం



జిల్లాకు చెందిన హైకోర్టు జడ్జి శ్రీదేవికి గ్రంథాన్ని ఇస్తున్న కవులు



'నిర్మల్ జిల్లా సమగ్రస్వరూపం' గ్రంథం ముఖచిత్రం

- 'నిర్మల్ జిల్లా సమగ్ర స్వరూపం' పేరిట పుస్తకాన్ని రూపొందించిన సాహితీవేత్తలు
- ఆవిష్కరించిన కవులు, కళాకారులు
- తెలంగాణ సారస్వత పరిషత్ సహకారంతో విపణిలోకి విడుదల

నిర్మల్ ఖిల్లా: నిర్మల్ అనగానే కవులు, కళాకారులు గుర్తొస్తారు. జిల్లా చరిత్రలో ఇక్కడ ఆది నుంచి సాహితీ సౌరభాలు విరబూస్తున్నాయి. తొలితరం కవుల నుంచి ప్రస్తుత పద్యకవులు, వచన కవులు, కళాకారులు, సాహితీవేత్తలకు ఇక్కడ కొదవలేదు. ఈ వారసత్వాన్ని వర్తమాన కవులు, కళాకారులు కొనసాగిస్తున్నారు. ఇటీవల 'నిర్మల్ జిల్లా సమగ్ర స్వరూపం' పేరిట గతించిన నిర్మల్ చరిత్రను ముందు తరాల వారికి తెలిసేలా జిల్లాలోని కవులు, కళాకారులు, సాహితీవేత్తలు గ్రంథస్థం చేశారు. జిల్లా వాస్తవ్యులకు ఎంతో కొంత సాహితీ సృజన ఉందనడంలో అతిశయోక్తి లేదు. ప్రస్తుతం పలు సామాజిక మాధ్యమాల్లోనూ వర్తమాన కవులెందరో తమ సాహితీ ప్రతిభ చాటుకుంటున్నారు. 'నిర్మల్ జిల్లా సమగ్ర స్వరూపం' పుస్తకాన్ని ఇటీవల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.

పుస్తకంలో ఏముందంటే..

నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న కోటలు, గఢీలు, భౌగోళిక స్థితిగతులు, శిల్పాలు, చిత్రకారుల నేపథ్యం, రాజకీయరంగం, వ్యవసాయ రంగం, సాహిత్యం తదితర అంశాలపై జిల్లాలోని దాదాపు 46 మంది వ్యాసకర్తలు సమష్టిగా శ్రమించి పరిశోధించిన అంశాలను గ్రంథీకరించారు. ఈ అంశాలన్నిటినీ క్రోడీకరించి దాదాపు 400 పేజీలతో పుస్తకాన్ని విడుదల చేశారు.

తొలితరం నుంచి యువతరం వరకు..

నిర్మల్ జిల్లాలో సాహితీ పరంపర కొనసాగిస్తున్న తొలితరం కవుల నుంచి మొదలుకుని సమకాలీన సాహితీవేత్తల చరిత్రతో పాటు నేటి వర్ధమాన యువ కవులు, కళాకారులు సాహితీ ఆసక్తి కలిగిన ఎందరో వ్యక్తుల సమగ్ర చరిత్ర ఇందులో పొందుపరిచారు. 63మంది వచన కవుల రచనలు, విశేషాలు వారి సాహితీ సృజనతోపాటు మరో 20 మంది వంశపారంపర్య ఆయుర్వేద వైద్యుల సమాచారం, గ్రామాల్లో ఆనాడు అందించిన వైద్యసేవల వివరాలు కూడా చేర్చారు. మరో 40 మంది పద్య కవుల వివరాలు వారి పద్య, గద్య రచనలు, 63 సామాజిక సాంస్కృతిక, సాహితీ సంస్థల వివరాలు, 8 మంది కథా రచయితల వ్యాసాలు, 14 మంది బాల సాహితీవేత్తల రచనల సమాహారం ఇందులో ఉంది. మరో నలుగురు నవలాకర్తల నవలల విశేషాలు, సుమారు 40 మంది లబ్ధప్రతిష్టుల పరిచయం, పర్యాటక కేంద్రాలు, విడిది కేంద్రాలు, జలపాతాలు, ఆలయాలు, పరిశోధకుల వివరాలున్నాయి. నిర్మల్ జిల్లా సమకాలీన జీవన విధానం, జాతరలు, ఆచార సంప్రదాయ వివరాలు పొందుపరచబడ్డాయి. వీటితోపాటు స్థానిక ప్రాచీన కవులైన బోయ ధర్మయ్య, మామడ మునిపంతులు, పొన్నకంటి రాజయ్య, నేటి తరాన్ని ప్రభావితం చేసిన మడిపల్లి భద్రయ్య తదితర జిల్లాకు చెందిన వారి వ్యాసాలు ఉంటాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన బాసర సరస్వతీ కళావైభవం, కదిలి మాతాన్నపూర్ణేశ్వరి ఆలయ విశిష్టత, బౌద్ధం విలసిల్లిన పరిస్థితులు, ఆనవాళ్లు, శైవ, వైష్ణవ, జైన ఆధ్యాత్మిక విధానాలు పరిఢవిల్లిన తీరును గ్రంథస్థం చేశారు. నిర్మల్ ప్రత్యేకతను చాటిచెప్పే ఖడ్గాలు, కత్తులు, పిరంగుల తయారీ వంటి రక్షణ, చారిత్రక అంశాలు కూడా పొందుపరిచారు. పండుగలు, కోటలు, కొయ్య బొమ్మలు, సినీ కళాకారులు, షార్ట్ ఫిలిమ్స్, నాటక మేళాలు, కళాకారుల వివరాలు, స్వర్ణకార వృత్తి తదితర అంశాలపై విశిష్ట వ్యాసాలు ప్రచురించారు. నిర్మల్ జిల్లా సమగ్ర చరిత్రతో పాటు నిర్మల్ అస్తిత్వానికి ప్రతీకగా ఈ గ్రంథం ఉంటుందని సాహితీవేత్తలు అభివర్ణిస్తున్నారు. జిల్లా నుంచి ప్రస్తుతం బొందిడి పురుషోత్తం, నేరెళ్ల హన్మంతు, వెంకట్, చక్రధారి, దామెర రాములు, పత్తి శివప్రసాద్, కరిపె రాజ్‌కుమార్, పుండలీక్ రావు, పోలీస్ భీమేశ్, కృష్ణంరాజు, కామారపు జగదీశ్వర్, అబ్బడి రాజేశ్వర్‌రెడ్డి తదితర కవులు, రచయితలు తమ రచనలతో సామాజిక చైతన్యప్రతీకలుగా కొనసాగుతున్నారు. ప్రతీ ఒక్కరిదగ్గర ఉండాల్సిన పుస్తకమని వారు సూచిస్తున్నారు.

గ్రంథంలోని అంశాల్లో కొన్ని..

- జిల్లా భౌగోళిక స్వరూపం, పరిస్థితులు, శాసనాలు-పూర్వ చరిత్ర.
- బౌద్ధ, జైన, శైవ, వైష్ణవ ఆధ్యాత్మిక విధానాలు, చారిత్రక సాక్ష్యాలు.
- రాంజీగోండు చరిత్ర, కాశీ యాత్రలో నిర్మల్ ప్రస్తావన.
- ప్రాచీన ఆలయాలు, జాతరలు, పుణ్యక్షేత్రాల వైభవం, పర్యాటక ప్రాంతాలు, జలపాతాలు.
- నిర్మల్ జిల్లా భాష, పద్య, గద్య సాహిత్యం, జిల్లాలోని పరిశోధకులు.
- శాస్త్రీయ నృత్యం, నిర్మల్ కొయ్య బొమ్మలు, చిత్రాలు, స్వర్ణకారుల ప్రత్యేక కళ.
- జానపద సాహిత్యం, వాద్యాలు, గ్రామీణ చరిత్ర, కళాకారులు, సాహితీ సాంస్కృతిక సంస్థలు-వాటి సేవలు.
- పరిశ్రమలు, వ్యవసాయం, వంశపారంపర్య ఆయుర్వేదం తదితర అంశాలు.

సారస్వత పరిషత్ సహకారంతో..

'నిర్మల్ జిల్లా సమగ్ర స్వరూపం' పుస్తకం ప్రచురణకు నోచుకోవడానికి కావలసిన ఆర్థిక తోడ్పాటును తెలంగాణ రాష్ట్ర సరస్వత పరిషత్ అందించింది. ఈ పుస్తకం గ్రంథస్థం చేసేందుకు ఓ కోర్ కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. దీని కన్వీనర్‌గా తుమ్మల దేవరావు వ్యవహరిస్తూ జిల్లాలోని సాహితీవేత్తల సమన్వయంతో అందుబాటులోకి తెచ్చారు. జిల్లా చరిత్ర తెలుసుకోవాలనుకునే నేటి యువతరానికి ఈ పుస్తకం ఎంతో తోడ్పడుతుంది. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు, పాఠశాల విద్యార్థులు, యువతకు ఉపకరిస్తుంది. పుస్తకాన్ని జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు జిల్లాలోని ఆయా శాఖ గ్రంథాలయాల్లో పాఠకులకు అందుబాటులోకి తేనున్నారు. నిర్మల్ జిల్లా అనగానే గుర్తుకు వచ్చే కొయ్యబొమ్మలు.. నిర్మల్ పెయింటింగ్స్ వంటి వాటికి కూడా ఈ పుస్తకంలో ప్రాధాన్యత కల్పించినట్లు కవులు, కళాకారులు తెలిపారు. ఈ గ్రంథం సంపాదకులుగా తెలంగాణ సారస్వత పరిషత్ సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లూరి శివారెడ్డి, జుర్రు చిన్నయ్య వ్యవహరించారు.

యువతరానికి ప్రయోజనం



'నిర్మల్ జిల్లా సమగ్ర స్వరూపం' గ్రంథం జిల్లా చరిత్రను పరిపూర్ణంగా తెలియజేస్తుంది. జిల్లా నేపథ్యం తెలుసుకోవాలనుకునే కుతూహలం కలిగిన ప్రతీ ఒక్కరి వద్ద ఉండాల్సిన పుస్తకమిది. దాదాపు 46మంది వ్యాసకర్తలు సమష్టిగా శ్రమించి రాసిన పుస్తకం. చారిత్రకాంశాలన్నీ ఇందులో నిక్షిప్తం చేయబడ్డాయి.

– పోలీస్ భీమేశ్, యువకవి, కళాకారుడు

భావితరాలకు అందించాలి



జిల్లా చరిత్రను గ్రంథస్థం చేయడంలో పలువురు కవులు, కళాకారులు శ్రమించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేవారికి, స్థానిక అంశాలను తెలుసుకోవాలనే వారికి, జిజ్ఞాస కలిగిన వ్యక్తులకు, అధ్యయనం చేసే పరిశోధకులకూ ఈ పుస్తకం ఉపయోగపడుతుంది. ఇందులో మరెన్నో విషయాలున్నాయి.

– తుమ్మల దేవరావు, గ్రంథ రచన కోర్ కమిటీ కన్వీనర్

విద్యార్థులకు ఉపయోగకరంగా..



జిల్లాలోని అన్ని ప్రాంతాల నేపథ్యం, చరిత్ర, సంస్కృతి, జీవన విధానం, సాహిత్య ప్రగతి తదితర అంశాలు ఈ పుస్తకంలో ఉంటాయి. ఇది భావితరాలకు వారసత్వ నిధి అని చెప్పవచ్చు. జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు.. చరిత్రలో వారి భాగస్వామ్యం వంటి అంశాలు ఇమిడి ఉంటాయి. యువత, విద్యార్థులకూ ఉపయోగపడుతుంది.

– డాక్టర్ అప్పాల చక్రధారి, కవి, వ్యాసకర్త

న్యూస్‌రీల్

డ్రైవర్లు జాగ్రత్తగా వాహనాలు నడపాలి



మాట్లాడుతున్న ఎంవీఐ వేణుగోపాల్

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఆదివారం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. ఎంవీహెచ్ వేణుగోపాల్, ఏఎంవీహెచ్ రజనీబాయి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని తెలిపారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. అనంతరం పలువురు ఆక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్లను సన్మానించారు. డీఎం అమృత, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత తదితరులున్నారు.

తహసీల్దార్ల సంఘం ఉమ్మడి జిల్లా కార్యవర్గం

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తహసీల్దార్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని విద్యుత్ తరంగిణి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి, తహసీల్దార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా వర్ణ, అసోసియేట్ అధ్యక్షులుగా భోజన్న, శ్యాంసుందర్, ఉపాధ్యక్షులుగా సుభాష్ చందర్, శ్రీనివాస్, నలంద ప్రియ, కోశాధికారిగా ఇమ్రాన్‌ఖాన్, ప్రచార కార్యదర్శిగా దిలీప్‌కుమార్, కార్యదర్శులుగా తుకారాం, సంతోష్‌రెడ్డి, శ్రీనివాసరావు, లక్ష్మి, వేణుగోపాల్ ఎన్నికయ్యారు.

నిర్మల్ కళాకారులకు నాట్య సరస్వతి అవార్డు



అవార్డు అందుకుంటున్న కళాకారులు

నిర్మల్ టౌన్: జిల్లాకు చెందిన నృత్యమాల నాట్య అకాడమీ శిక్షణ బృందం కళాకారులు రాష్ట్రస్థాయి కూచిపూడి నృత్యంలో అత్యంత ప్రతిభ కనబరిచి సరస్వతి పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో రాజరాజేశ్వర కళాభారతి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలో శిక్షణ బృందం కళాకారులు పాల్గొన్నారు. అవార్డు అందుకున్న కళాకారులను నృత్యమాల నాట్య అకాడమీ శిక్షకురాలు అంజలిరెడ్డి అభినందించారు.

కాంగ్రెస్ ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు అందజేత



దరఖాస్తు అందజేస్తున్న బాపురావు

ఖానాపూర్: భైంసా ఎంఎల్ఎస్ పాయింట్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసే మండలానికి చెందిన మెస్రం బాబురావు ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆదిలాబాద్ ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. బాబురావుకు విద్యార్థి ఉద్యమాల నుంచి రాజకీయాల్లో పనిచేసిన నేపథ్యం ఉంది. డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వర్‌రావు అధ్యక్షతన ఏర్పడ్డ విద్యార్థి యువజన జేఏసీ కార్యక్రమంలో కీలక పాత్ర పోషించారు. అనేక పోరాటాల్లోనూ తాను చేసిన ఉద్యమ నేపథ్యాన్ని కాంగ్రెస్ అధిష్ఠానానికి వివరించారు.

విధుల్లోకి స్టాఫ్ నర్సులు



లెటర్ ఇస్తున్న స్టాఫ్‌నర్సులు

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖలో స్టాఫ్ నర్సుగా అర్హత సాధించి ఉద్యోగంలో చేరిన వారికి ఈనెల 31న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆర్డర్ కాపీలు అందించారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్ ఆధ్వర్యంలో ఈనెల 3, 4 తేదీల్లో కౌన్సిలింగ్ నిర్వహించారు. నిర్మల్ జిల్లా మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రిలో ఎంపిక చేసుకున్న 34 మంది ఆదివారం జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీల్‌కు జాయినింగ్ లెటర్లు ఇచ్చారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సంఘటన మంత్రి, సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ సూచించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థాయి పార్టీ సమీక్షా సమావేశం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించారు. చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రచారం చేస్తూ పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. అంతకుముందు చంద్రశేఖర్‌కు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్, నాయకుడు అల్లాపూర్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు రామారావ్ పటేల్, పాయల్ శంకర్, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్న భూమయ్య, పలు జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, అసెంబ్లీ కన్వీనర్లు పాల్గొన్నారు.

'కడెం' కళకళ



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

కడెం: కడెం ప్రాజెక్ట్, పరిసరాలు ఆదివారం పర్యాటకులతో సందడిగా మారాయి. జగిత్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు, పాఠశాలల విద్యార్థులు ప్రాజెక్ట్ అందాలను తిలకించారు. బోటింగ్ చేశారు. ఈ సందర్భంగా సెల్ఫీలు దిగుతూ ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు.

ప్రశాంతంగా సీవోఈ సెట్



లెఫ్ట్ పోచంపాడ్‌లో కేంద్రాన్ని పరిశీలిస్తున్న అలివేలు

సోన్: మండలంలోని లెఫ్ట్‌పోచంపాడ్‌లో ఆదివారం నిర్వహించిన (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ) సీవోఈ సెట్ ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా గురుకుల కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రేమలత మాట్లాడారు. నిజామాబాద్ ఆర్‌సీవో (ప్రాంతీయ సమన్వయ అధికారి) అలివేలు పరీక్షా కేంద్రాన్ని పరిశీలించినట్లు తెలిపారు. సీవోఈ సెట్‌కు 480 మందికి గాను 462మంది విద్యార్థులు హాజరు కాగా, 18 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

జిల్లాకూ కొత్త కాలేజీలు



జిల్లాకేంద్రంలోని మెడికల్ కాలేజీ

- నర్సింగ్, పారామెడికల్, ఫిజియోథెరపీ..
- వైద్యవిద్య ఉన్నచోట ఇవి పెట్టాలన్న సీఎం
- మరింతమంది విద్యార్థులకు అవకాశం
- 'ఇంజినీరింగ్'పై మాత్రం మొండిచేయే..!
- ఇంకా నెరవేరని ఐటీ టవర్ డిమాండ్

నిర్మల్: జిల్లాకు కొత్త కాలేజీలు రానున్నాయి. ఇప్పటికే మెడికల్ కాలేజీలున్నచోట నర్సింగ్, పారామెడికల్, ఫిజియోథెరపీ కళాశాలలు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. గత నెల 30న హైదరాబాద్‌లో నిర్వహించిన వైద్యారోగ్య సమీక్షలో ఆదేశాలు జారీ చేశారు. ఈలెక్కన జిల్లాలో ఇప్పటికే మెడికల్ కాలేజీ ఉన్నందున త్వరలోనే జిల్లాకు నర్సింగ్, పారామెడికల్, ఫిజియోథెరపీ కాలేజీలూ రానున్నాయి. వైద్యవిద్య విషయంలో ముందడుగు పడుతున్నా.. ఇంజినీరింగ్ కాలేజీపై మాత్రం ఇప్పటికీ ఎలాంటి కదలిక లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మల్‌లోనూ ఇంజినీరింగ్ కాలేజీ, ఐటీటవర్ ఏర్పాటు చేస్తామని చెప్పి విస్మరించింది. ఈమేరకు కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ సర్కారు వీటిపైనా దృష్టి పెట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.

మూడు కాలేజీలు..

జిల్లాలో ఈ విద్యాసంవత్సరం నుంచే మొత్తం వంద సీట్లతో మెడికల్ కాలేజీ ప్రారంభమైంది. ప్రస్తుతం తరగతులూ కొనసాగుతున్నాయి. ఇక వైద్యవిద్యకు అనుబంధ కోర్సులనూ జతచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ప్రధానంగా మెడికల్‌కాలేజీలున్నచోట, వాటి అవసరాలకు తగ్గట్లుగా నర్సింగ్, పారామెడికల్, ఫిజియోథెరపీ కాలేజీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈమేరకు జిల్లాకేంద్రంలో త్వరలోనే ఈ కోర్సులూ ప్రారంభం కానున్నాయి. వీటి ద్వారా మరో 200–300 మంది విద్యార్థులకు వైద్యసంబంధిత విద్య అందుబాటులోకి రానుంది.

ఎక్కడెక్కడికో వెళ్తున్నారు..

ఆస్పత్రుల్లో వైద్యులకంటే నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది అవసరం ఎక్కువగా ఉంటుంది. పెరుగుతున్న ఆస్పత్రుల్లో పనిచేయడానికి శిక్షణ పొందిన స్టాఫ్ తప్పనిసరి అవుతోంది. ఈక్రమంలో చాలామంది యువత వైద్యసేవలకు సంబంధించిన కోర్సులపైనా దృష్టిపెడుతున్నారు. నర్సింగ్, పారామెడికల్ కోర్సులు చదవడానికి నిజామాబాద్, హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో దూరభారంతో పాటు ఆర్థికంగానూ ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి యువతకు స్థానికంగా కాలేజీలు అందుబాటులో ఉంటే తక్కువ ఖర్చులో విద్యతో పాటు వెంటనే ఉపాధి దొరికే అవకాశాలుంటాయి. ప్రస్తుతం ఫిజియోథెరపీకి కూడా మంచి డిమాండ్ ఉంది. ఈ కోర్సుపై ఇటీవల చాలామంది విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు.

ఐటీటవర్ అంతేనా..

జిల్లాలో ఇంజినీరింగ్ చదివిన, చదువుతున్నవాళ్లు సగటున రెండుమూడిళ్లకొకరు ఉన్నారు. ఇలాంటి జిల్లాలో సంబంధిత ఉద్యోగావకాశాలు చూపించాల్సిన అవసరముంది. ఇదే విషయంలో గతేడాది అక్టోబర్‌లో నిర్మల్‌కు వచ్చిన అప్పటి ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ఇక్కడ ఐటీ టవర్ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. దీనిపై అప్పట్లో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తంచేశారు. కానీ.. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమితో ఆ ఆశ అలాగే మిగిలిపోయింది. కొత్తగా కొలువుదీరిన సర్కారు ఇప్పుడిప్పుడే విద్య, ఉద్యోగ కల్పనపై దృష్టిపెడుతోంది. ఈక్రమంలో జిల్లాలో ఇంజినీరింగ్ కాలేజీతో పాటు ఐటీ టవర్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ వస్తోంది.

ఇంజినీరింగ్ సంగతేంది..?

జిల్లాకేంద్రంలో సమీకృత కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి వచ్చిన గత సీఎం కేసీఆర్‌ను నిర్మల్ జిల్లాకు ఇంజినీరింగ్ కాలేజీ కావాలని అడిగితే.. ఆదిలాబాద్ జిల్లాకు మంజూరు చేశారు. అప్పట్లో దీనిపై జిల్లావాసులూ పెదవి విరిచారు. తాజాగా కొత్త ప్రభుత్వం పాతవి, కొత్తవి కలిపి 11 ఇంజినీరింగ్ కాలేజీల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది. ఇందులో నిర్మల్‌కు మాత్రం అవకాశం ఇవ్వలేదు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో మహిళా ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నారు. ఇతర జిల్లాల్లోనూ ఏర్పాటుకు ఆదేశించారు. జిల్లాలో ఎప్పటి నుంచో డిమాండ్ ఉన్నప్పటికీ మొండి చేయి చూపారు.

జాతీయ యోగా పోటీల్లో నిర్మల్ విద్యార్థుల విజయం



విజేతలుగా నిలిచిన జిల్లా విద్యార్థులు

నిర్మల్: బెల్లంపల్లిలో ఆదివారం నిర్వహించిన జాతీయస్థాయి యోగా పోటీల్లో జిల్లావిద్యార్థులు విజేతలుగా నిలిచారు. జిల్లా యోగాసన్ అసోసియేషన్ అధ్యక్షురాలు అన్నపూర్ణ, యోగా న్యాయనిర్ణేత సుమిత్‌ముధుల్కర్, మాస్టర్ ప్రదీప్ ఆధ్వర్యంలో విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న జ్యోతిశ్రీ, నవ్యశ్రీ, రజిత, అర్చన, సునీత, లలిత, విష్ణుశ్రీ, ఆరాధ్య, నిహారిక, శ్రీని త్య, విద్వాన్, మ్రితుల్, శ్రీఘ్యాన్, విద్వాన్, శ్రీనిత, అన్వేష, సాయిచైతన్య, అనన్య, శ్రీనిధి నాలుగు బంగారు, మూడు వెండి, ఎనిమిది కాంస్య పతకాలు సాధించారు. వీరిని పోటీల జడ్జి రాజలింగం అభినందించారు.

ప్రమాదకర మలుపులు



వాలేగాం-దేగాం సమీపంలో..



పాంగ్రి-చుచుంద్ సమీపంలో..

భైంసా మండల కేంద్రం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల్లోని పలు మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపుల వద్ద వాహనాలు ఎదురెదురుగా ఢీకొంటున్నాయి. దేగాం–వాలేగాం, పాంగ్రి, చుచుంద్, భైంసా పట్టణానికి సమీపంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు, మిర్జాపూర్ తదితర మార్గాల్లోని మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

– భైంసా రూరల్

మహిళకు రక్తకణాలు దానం

భైంసాటౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హిమబిందు అనే మహిళకు రక్త కణాలు తక్కువ కావడంతో పట్టణానికి చెందిన ఆనందిత ఫౌండేషన్ సభ్యుడు వాడేకర్ లక్ష్మణ్ స్పందించి రక్తకణాలు దానం చేశారు. హిమబిందు చికిత్స కోసం రక్తకణాలు అవసరముండగా ఆమె బంధువులు ఆదివారం వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేశారు. దీంతో వెంటనే స్పందించిన లక్ష్మణ్ ఆస్పత్రికి చేరుకుని రక్తకణాలు అందించారు. బాధిత మహిళ కుటుంబీకులు, ఆస్పత్రి సిబ్బంది లక్ష్మణ్‌ను అభినందించారు. ఇప్పటివరకు 14 సార్లు రక్తదానం చేసినట్లు అతడు పేర్కొన్నారు.

నాగోబా జాతరకు సన్నద్ధం

- మెస్రం వంశీయులు, భక్తులకు శాశ్వత, తాత్కాలిక మరుగుదొడ్లు
- ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్న జిల్లా అధికారులు



నాగోబా ఆలయం

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా జాతర సమీపించడంతో పనుల ఏర్పాట్లను అధికారులు ముమ్మరం చేశారు. నాగోబా పూజకు హాజరవుతున్న మెస్రం వంశీయులకు, జాతరకు వచ్చే భక్తులకు సరిపడా మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ దీపాల ఏర్పాటు, ఆర్టీసీ బస్టాండ్, వాహనాల పార్కింగ్, ట్రైబజర్ నిర్వహనకు ప్లాట్ ఏర్పాటు పనులు ముమ్మరం చేశారు. పనులను కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ గౌస్ ఆలాం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాలతో పాటు జిల్లా స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తూ గడువులోగా పూర్తి చేయించడానికి కృషి చేస్తున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో రూ.12లక్షలతో ఏర్పాట్లు..

ఫిబ్రవరి 9న మెస్రం వంశీయుల మహా పూజతో ప్రారంభం కానున్న నాగోబా జాతర ఏర్పాటు పనులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ముమ్మరం చేశారు. సుమారు రూ.12లక్షల నిధులతో తాగునీటి సౌకర్యాలు కల్పించడంతో పాటు మరుగుదొడ్లు, స్నానపు గదులను, పశువుల తొట్టిలు ఏర్పాటు చేస్తున్నారు. మర్రిచెట్టు వద్ద తాత్కాలికంగా పది స్నానపు గదులు, శాశ్వతంగా పది మరుగుదొడ్లకు మరమ్మతులు చేశారు. పోలీస్ క్యాంప్ వద్ద, ఆర్టీసీ బస్టాండ్ వద్ద, దర్బార్ హాల్ వద్ద పది చొప్పున తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాట్లు చేశారు. అదే విధంగా నాగోబా సంప్రదాయ పూజలు ముంగించే వరకూ మెస్రం వంశీయులు బస చేయనున్న గోవడ్ సమీపంలో ఇప్పటికే శ్వాశతంగా ఉన్న మరుగుదొడ్లను మరమ్మతులు చేయడంతో పాటు ఈసారి అదనంగా మరో 20శ్వాశత మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మాణం చేశారు. 10తాత్కాలిక స్నానపు గదులు ఏర్పాటు చేశారు. నాగోబా సంప్రదాయ పూజలకు వచ్చే మెస్రం వంశీయులకు, భక్తులకు ఎలాంటి లోటులేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు...

నాగోబా ఆలయ పరిసర ప్రాంతంతో పాటు మెస్రం వంశీయులు బస చేయనున్న మర్రి చెట్టు, గోవడ్ ప్రాంతంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు పూర్తి చేశారు. అదనపు కూలీలను ఏర్పాటు చేసి పారిశుధ్య పనులు చేయించారు. అదే విధంగా నాగోబా ఆలయ పరిసర ప్రాంతంతో పాటు మర్రిచెట్టు, గోవడ్ పరిసర ప్రాంతంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.

దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి...

దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నాగోబా జాతర ఏర్పాటు పనులను పూర్తి చేశారు. నాగోబా ఆలయ ముస్తాబు, కోనేరు బావి శుభ్రత, గోవడ్, కోనేరు, ముఖద్వారం గేట్లు, గొడలకు రంగులు వంటి పనులు పూర్తిచేశారు. ట్రైబజర్ స్థలం ఏర్పాటు, పార్కింగ్, ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు పనులను పూర్తి చేశారు. భక్తులకు, మెస్రం వంశీయులకు ఎలాంటి లోటులేకుండా ఏర్పాట్లు చేసినట్లు దేవాదాయ శాఖ ఈవో రాజమౌళి తెలిపారు.

రోడ్డు మరమ్మతులు పూర్తి..

ముత్నూర్ నుంచి కేస్లాపూర్ గ్రామం వరకూ ఉన్న డబుల్ రోడ్డు మరమ్మతు పనులను అధికారులు పూర్తి చేశారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలను మరమ్మతులు చేశారు. అదే విధంగా రోడ్డుకు ఇరువైపులా బ్లెడ్ ట్రాక్టర్ ద్వారా లేవలింగ్ చేయించి పిచ్చి మొక్కలు తొలగించారు.



మర్రిచెట్టు వద్ద తాత్కాలిక స్నానపు గదులు



ముస్తాబైన కోనేరు బావి



ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు



పశువుల నీటి తొట్టిలు

క్లుప్తంగా

సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టుకు ద్వితీయ స్థానం



జట్టుకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

నేరడిగొండ: మెదక్ జిల్లాలో 9వ తెలంగాణ జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ బాలికల రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 3,4వ తేదీల్లో జరిగాయి. క్వార్టర్ ఫైనల్‌లో హైదరాబాద్ జట్టుతో 6–0తో గెలుపొంది సెమీ ఫైనల్‌కు చేరుకుంది. సెమీఫైనాల్‌లో మెదక్‌తో 2–0తో గెలుపొంది ఫైనల్‌కు చేరుకుంది. ఫైనల్‌లో నిజామాబాద్ జట్టుతో తలపడి 0–8తో ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. ఈ పోటీలకు ముఖ్యఅతిథులు డీవైఎస్‌ఓ నాగరాజ్, ఇండియా సాఫ్ట్‌బాల్ జాయింట్ సెక్రటరీ శోభన్ బాబు, రాష్ట్ర సాఫ్ట్‌బాల్ ఉపాధ్యక్షుడు అభిషేక్ గౌడ్, రాష్ట్ర సాఫ్ట్‌బాల్ ప్రధాన కార్యదర్శి నవీన్, ఇండియా సాఫ్ట్ బాల్ కోచ్ చిన్నికృష్ణ పాల్గొని బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గోడం జ్యోతిరాం, జిల్లా ప్రధాన కార్యదర్శి గస్కంటి గంగాధర్, కోచ్ రవి. స్నేహ, వి.అఖిల, ఎన్‌ఐఎస్ కోచ్ పాల్గొన్నారు.

ఎల్లిగడ్డలు కిలోకు రూ.560



ఎల్లిగడ్డలు

కుంటాల: వెల్లుల్లి మానవ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. శరీరానికి కూడా అనేక ప్రయోజనాలను కలిగిస్తుంది. ప్రతినిత్యం వంటకాల్లో వెల్లుల్లి తప్పనిసరి. ఆదివారం కుంటాల వారసంతలో రూ.560కిలో చొప్పున వ్యాపారులు విక్రయించారు.

రిమ్స్‌లో మహిళ మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా హీరాపూర్ కొటారి గ్రామానికి చెందిన రాథోడ్ కవిత (36) చికిత్స పొందుతూ రిమ్స్ ఆస్పత్రిలో మృతిచెందినట్లు టూటౌన్ ఏఎస్సై ముకుంద్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గతేడాది 8 ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని పత్తి, కంది పంటలు వేశారు. దిగుబడి రాకపోవడంతో దిగాలు చెందిన ఆమె పంట చేనులో శనివారం సాయంత్రం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి మృతిచెందినట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

గుడిహత్నూర్: మండలంలోని జాతీయ రహదారి 44పై సీతాగోంది వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇచ్చోడ మండలం గేర్జం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కొప్పుల సుభాకర్ (47) మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సుభాకర్ తన భార్య మమతతో కలిసి పని నిమిత్తం ఆదిలాబాద్ వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఇద్దరూ ఆటోలో వస్తుండగా శనివారం రాత్రి 11 గంటల సమయంలో సీతాగోంది గ్రామం వద్ద సుభాకర్ నడుపుతున్న ఆటోను వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సుభాకర్, మమత తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అంబులెన్సులో రిమ్స్‌కు తరలించారు. సుభాకర్ పరిస్థితి విషమిస్తుండడంతో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కుమారుడు అభిలేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

క్రీడల్లో రాణిస్తే అన్ని రంగాల్లో సముచిత స్థానం



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

దిలావర్‌పూర్: క్రీడల్లో రాణిస్తే అన్నిరంగాల్లో సముచిత స్థానం లభిస్తుందని పెటా రాష్ట్ర బాధ్యుడు దయానంద్‌రెడ్డి అన్నారు. మండలంలోని న్యూలోలం గ్రామంలోని లిటిల్ స్కాలర్స్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జిల్లా స్థాయి సీనియర్ ఖోఖో జట్ల ఎంపిక కోసం ఆదివారం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని క్రీడాకారులను పరిచ యం చేసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. అనంతరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన సీనియర్ బాల బాలికల జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు యదాద్రి భువనగిరి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా ఖోఖో అసోసియేషన్ పేర్కొంది. జిల్లా ఖోఖో అధ్యక్షుడు ఈశ్వర్, కార్యదర్శి ఎస్.శ్రీధర్‌రెడ్డి, లిటిల్ స్కాలర్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్ బి.సురేశ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు రాష్ట్రపాల్, కృష్ణ, భీమన్న, రాంజీ, శంకర్ ఉన్నారు.

జిల్లా స్థాయి సీనియర్ బాలుర జట్టు ఇదే..

మండలంలోని న్యూలోలం గ్రామంలోని లిటిల్ స్కాలర్స్ ఉన్న పాఠశాలలో ఆదివారం జిల్లాస్థాయి సీనియర్ ఖోఖో జట్లను ఎంపిక చేశారు. సీనియర్ బాలుర జట్టులో రాజిరెడ్డి, ఎన్.సాయికుమార్, ప్రణీత్, పృథ్వీ, పి.మధు, సీహెచ్ శ్రీను, ఏ.విజయ్‌కుమార్, ఏ.గణేష్, ఏ.సునీల్, ఎం.అంజన్న, టి.నరేశ్, జె.ప్రదీప్, పి.ప్రఫుల్, కె.చేతన్, ఎం.సాయిప్రసాద్, నిఖిల్, నవీన్‌కుమార్‌లను ఎంపిక చేశారు.

జిల్లా స్థాయి సీనియర్ బాలికల జట్టు ఇదే..

జిల్లా స్థాయి సీనియ్ ఖోఖో జట్టుకు ఎంపికైన బాలికల్లో ఎస్.సోని, యోగిత, పి.అంజలి, ఏ.సోని, కె.సత్యశీల, కె.నాగేశ్వరి, టి.నందిని, కె.దేవిక, జి.అక్షయ, జి.శ్రీనిధి, జి.గంగాసాగర, ఎం.స్వరూప, ఆర్.వైష్ణవి, ఆర్.అలేఖ్య, జి.సమీక్ష, డి.అశ్విత, బి.నవ్యశ్రీ, జి.సోని, డి.శ్రీజ ఎంపికయ్యారు.

నేడు ఇంద్రాదేవి చెంతకు మెస్రం వంశీయులు



ఇంద్రాదేవి ఆలయానికి వెళ్తున్న మహిళలు

ఇంద్రవెల్లి: పుష్యమాస అమావాస్యను పురస్కరించుకొని ఈ నెల 9న నిర్వహించే నాగోబా మహాపూజ కోసం తీసుకొస్తున్న గంగాజలం మెస్రం వంశీయులు తిరుగు ప్రయాణంలో మండలంలోని దోడంద గ్రామానికి గ్రామ పొలిమేరలో చెట్టుపై భద్రంగా ఉంచారు. ఆదివారం సాయంత్రం గంగాజలం తీసుకొని ఎడ్ల బండ్లతో ఇంద్రాదేవి ఆలయానికి బయల్దేరారు. సోమవారం ఉదయం ఆదివాసీల ఆరాధ్యదైవం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయానికి చేరనున్నారు. సాయంత్రం కేస్లాపూర్ గ్రామ సమీపంలోని మర్రిచెట్టు వద్ద మర్రిచెట్టు వద్ద మూడు రోజులు బస చేసి వారి సంప్రదాయ పూజలతో పాటు మెస్రం వంశంలో మరణించిన పెద్దల పేర్లతో తూమ్(ఖర్మకాండ) చేయనున్నారు. 9న గంగాజలంలో నాగోబా విగ్రహానికి, నాగోబా ఆలయానికి జలాభిషేకం చేసి మహాపూజ చేసి జాతర ప్రారంభించనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు.

వర్గీకరణ సాధించే వరకూ మాదిగలు ఏకం కావాలి



మాట్లాడుతున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్/ఎదులాపురం: ఏబీసీడీ వర్గీకరణ సాధించేంతా వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మాదిగలంతా ఏకం కావాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరదరపు ప్రవీణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న పిలుపు మేరకు, రాష్ట్ర కార్యదర్శి గజ్జల కాంతారావ్, జిల్లా అధ్యక్షుడు సుంకే రమేష్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎమ్మార్పీఎస్ మహిళా విభాగం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షురాలిగా పరిమళ మాదిగ, ప్రధాన కార్యదర్శి పుష్పలత, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా జయేందర్, పట్టణ అధ్యక్షుడిగా దర్శనాల గంగన్నలను నియమించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సీవోఈ సెట్

- దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 5,918
- హాజరైనవారు 5,774 మంది



బెల్లంపల్లి సీవోఈ కళాశాల పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న ఆర్సీవో స్వరూపారాణి

బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదివారం నిర్వహించిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ) కామన్ ఎంట్రెన్స్ టెస్ట్–2024 ప్రశాంతంగా జరిగింది. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో మొత్తం 5,918 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 5,774 మంది హాజరుకాగా 144 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 97.55 శాతం నమోదైనట్లు ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి ప్రకటించారు. సీవోఈ సెట్ నిర్వహణ కోసం ఆదిలాబాద్ రీజియన్‌లో మొత్తం 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఆదిలాబాద్ జిల్లాలో నాలుగు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో నాలుగు, మంచిర్యాల జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జంబ్లింగ్ పద్ధతిలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడంతో సుదూర ప్రాంతాల విద్యార్థులు తల్లిదండ్రులు, తోబుట్టువులతో కలిసి పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులు సామూహికంగా రావడంతో పరీక్ష కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. నిర్దేశించిన సమయానికి గంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల ప్రధాన ద్వారం ఎదుట ఏర్పాటు చేసిన నోటీసు బోర్డుపై అంటించిన హాల్‌టికెట్ నంబర్లను సరిచూసుకుని విద్యార్థులు పరీక్ష హాల్‌లోకి వెళ్లారు. పరీక్ష కేంద్రంలో ముందుగా విద్యార్థులకు ఓఎంఆర్ షీట్‌పై బబ్లింగ్ చేసే విధానం గురించి అవగాహన కల్పించారు. ఆ తర్వాత ఉదయం 10 గంటలకు ప్రారంభం కాగా మధ్యాహ్నం ఒంటిగంటకు ముగిసింది.

సౌకర్యాల కల్పన

పరీక్షకు హాజరైన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేశారు. సెంటర్లలో తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ ఏర్పాటు చేశారు. పరీక్ష సజావుగా సాగడానికి కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు, తోబుట్టువులు చెట్లకింద, వాహనాల్లో సేద తీరారు.

కేంద్రాలను పర్యవేక్షించిన ఆర్సీవో

సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ ప్రవేశ పరీక్ష కేంద్రాలను సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి పర్యవేక్షించారు. బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన సీవోఈ బాలుర కళాశాల, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల, కాసిపేట సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల కేంద్రాలను సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం, ఫస్ట్ ఎయిడ్ సెంటర్, హెల్ప్‌డెస్క్‌ల వివరాలు తెలుసుకుని చీఫ్ సూపరింటెండెంట్లు ఐనాల సైదులు, స్వరూప, సంతోష్‌కుమార్, సిబ్బందిని ఆర్సీవో ప్రత్యేకంగా అభినందించారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలు

పరీక్ష కేంద్రం	విద్యార్థుల సంఖ్య	హాజరైన వారు
ఆదిలాబాద్ (సీవోఈ బాలికలు)	648	639
బోథ్ (బాలికలు)	648	634
ఇచ్చోడ(బాలురు)	255	246
ఆదిలాబాద్ డిగ్రీ కళాశాల(బాలికలు)	172	165
ఆసిఫాబాద్ (బాలురు)	528	519
సిర్పూర్‌టీ (బాలురు)	347	338
సిర్పూర్‌టీ(బాలికలు)	347	338
రెబ్బెన(బాలికలు)	273	266
బెల్లంపల్లి(సీవోఈ,బాలురు)	504	490
బెల్లంపల్లి(బాలికలు)	480	472
కాసిపేట(బాలురు)	401	390
లక్సెట్టిపేట(బాలికలు)	480	467
చెన్నూర్ (బాలికలు)	550	531
జైపూర్(బాలురు)	285	279

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



కిరణ్ (ఫైల్)

తానూరు: మండల కేంద్రానికి చెందిన బోనాల సాయినాథ్ (22) శనివారం సాయంత్రం తన వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... బోనాల సాయినాథ్ కొన్ని నెలలుగా మద్యానికి అలవాటుపడ్డాడు. శనివారం సాయంత్రం 5గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లిపోయి రాత్రి వరకూ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతడి కోసం వ్యవసాయ పొలానికి వెళ్లి చూడగా చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. ఆదివారం పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. తండ్రి పోతన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ వెల్లడించారు.

పురుగుల మందు తాగి బాలుడు..

నిర్మల్: పురుగుల మందు తాగి బాలుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దస్తురాబాద్ మండలంలోని మున్యాల తండా గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రభాకర్‌రెడ్డి వివరాల ప్రకారం ... నాగవత్ కిరణ్(14) గురువారం తండ్రి శ్రీనివాస్ మందలించడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో చేనులో క్రిమి సంహారక పురుగుల మందు తాగి పడిపోయాడు. అటుగా వెళ్లిన గొర్రెల కాపరి చూసి కుటుంబ సభ్యులకు తెలుపడంతో వెంటనే ఖానాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైనా చికిత్స కోసం నిర్మల్ తరలించగా పరిస్థితి విషమించడంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. బాలుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చదువులమ్మ ఒడిలో..

- రెండు దశాబ్దాల తర్వాత కలిసిన గురువులు
- మధుర స్మృతులను నెమరేసుకున్న వైనం
- డైట్ కళాశాలలో అ'పూర్వ' సమ్మేళనం



ఒకేచోట చేరిన పూర్వ ఛాత్రోపాధ్యాయులు

ఆదిలాబాద్‌టౌన్: వారంతా ఒకప్పటి ఛాత్రోపాధ్యాయులు.. ప్రస్తుతం వారందరూ ఎంతోమందికి విద్యాబుద్ధులు నేర్పుతూ వారి భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో వృత్తిరీత్యా బిజీగా ఉంటూ కాలం గడుపుతున్నారు. వారు ఉపాధ్యాయ శిక్షణ పొందిన దేవాలయంలో కలవాలని నిర్ణయించుకున్నారు. నెల రోజులుగా మిత్రులందరు వాట్సాప్ గ్రూప్‌గా ఏర్పడ్డారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాల వారికి వేదికగా నిలిచింది. రెండు దశాబ్దాల తర్వాత కలిసిన వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. మధురస్మృతులను నెమరేసుకున్నారు. 2004–06 బ్యాచ్‌కు చెందిన ఛాత్రోపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనానికి జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల వేదికగా మారింది. 85 మంది ఛాత్రోపాధ్యాయులు ఉండగా, 75మంది ఉపాధ్యాయులు కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండతో పాటు జిల్లాకు చెందిన వారు హాజరయ్యారు. మిత్రులను ఒకేచోట చేర్చేందుకు ఉపాధ్యాయులైన తోటి మిత్రులు శివకుమార్, గడుగు నరేందర్, కిరణ్ కుమార్, ఉప్పుం తిరుపతి, మల్లేష్, గజానంద్, వెంకటేష్‌లు ఎంతగానో శ్రమించారు. వీరికి శిక్షణ కల్పించిన గురువులు పాపాలాల్, శివకుమార్, అశోక్, జ్యోతివైద్య, ముండయ్య, శంకర్, నీలకంఠ, జలేందర్ రెడ్డి లను సన్మానించారు.

ప్రధాన 'కూడలి కట్టడి'తో ఇబ్బందులు

నిర్మల్ జిల్లా కేంద్రంలో ప్రధాన కూడలైన కొండా లక్ష్మణ్ బాపూజీ చౌక్‌లో పాత కలెక్టరేట్, మున్సిపల్, జిల్లా కోర్టుకు ప్రధాన మార్గమైన కూడలి వద్ద పోలీసులు ఆంక్షలు విధించి దారిని బారిగేట్లతో మూసేయడంతో ఈ మార్గం గుండా వెళ్లే వారికి అవస్థలు తప్పడం లేదు. ఇంద్రనగర్ నుంచి కూరగాయల మార్కెట్, ఆర్డీవో కార్యాలయంతో పాటు మున్సిపల్ కార్యాలయం, జిల్లా కోర్టు, ఫైర్‌స్టేషన్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయాలతో పాటు షార్ట్‌కట్‌లో ఈద్గాం చౌరస్తాకు వెళ్లే వాహనదారులతో పాటు పాదాచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో అధికారుల తీరుపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



మున్సిపల్ కార్యాలయం వద్ద



డివైడర్ పైనుంచి వెళ్తున్న మున్సిపల్ సిబ్బంది



కూరగాయల మార్కెట్ వద్ద



ఇబ్బంది పడుతూ రోడ్డు దాటుతున్న వృద్ధుడు